# పాత్రత

-తొత్తడి గణపతిరావు





**ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ**

'శాస్త్రిగారూ! క్షమించండి.. ఇన్నాళ్ళూ మిమ్మల్నే నమ్ముకున్నాం కాని మీరు చెయ్యించే పూజలుగాని, వ్రతాలు గాని మాకెలాంటి ఫలితాల్నీ యివ్వలేదు. ఎవరో పరమానందస్వాముల వారట చాలా మహిమ గలవారట. అదృష్టవశాత్తూ మా గోపాలం మా విషయం చెప్పి ఆయన్ని తీసుకొచ్చాడు. యింక ఆయినే మాకు దిక్కు. మీ వ్రతాలు, పూజలవల్ల ప్రయోజనం లేదని తేలిపోయింది' కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ అంది సుందరమ్మ.

'అమ్మా ఏమిటా మాటలు. నీ ఛాదస్తంతో... దేవుడిలాంటి శాస్త్రిగారిని...' అన్న మాటలను మధ్యలోనే అడ్డుకుంటూ...

'ఫర్వాలేదు బాబూ... నేనేమీ అనుకోను... ఆ అమ్మ మనసు... బాధ నాకు తెలియనివి కావు. నీకు పిల్లలు కలగటం లేదన్న బాధతో ఆ ముసలి ప్రాణం ఎంత విలవిలలాడిపోతుందో. నేనూహించగలను. సుందరమ్మగారూ... ఆ పరమానందస్వాముల గూర్చి నేనూ విన్నాను. ఆయిన్నే వేడుకుందాం. అబ్బాయికి సంతానం కలిగితే అంతకంటే కావల్సిందేముంది? నాకూ మీకూ ఉన్న అనుబంధం యీనాటిది కాదు. నాయుడుగారు కన్నుమూస్తున్నప్పుడు రాఘవను తృప్తిగా చూసుకుంటూ... శాస్త్రిగారూ నాకింకేం కోరికలు లేవండి... నా పేరు నిలిపే కొడుకు రాఘవ... వాడికీ అలాంటి మంచి కొడుకు పుడితే చాలు... అంటూ కన్నుమూసారు. అప్పటి నంచి నాయుడుగారి కోరిక ఎప్పుడు తీరుతుందా అని నేనూ ఎదురు చూస్తున్నానమ్మా' అని శాస్త్రిగారు అంటుండగా సూర్యనమస్కారం చేసి తిరిగి వస్తున్న పరమానందస్వాములకు అడ్డుతప్పుకోమన్నట్టుగా అందర్నీ హడావుడి చేసాడు గోపాలం.

కాషాయాంబరాలు... మెరిసిపోతున్న స్వర్ణ కంకణాలు... విభూతి రేఖలు... మెడలో రుద్రాక్షమాలలతో చూసిన వెంటనే ఎవరికైనా చేతులెత్తి నమస్కరించాలనే తలపు కలిగేటి స్వరూపంతో వెలిగిపోతున్నారు పరమానందస్వామి. స్వామిని చూసిన వెంటనే ఆయన పాదాలకు నమస్కారం చెయ్యాలని వంగింది సుందరమ్మ.

ఆమె చేతులు గాని శిరస్సు గాని ఎక్కడ తన పాదాలకు తాకుతాయో అని గాభరాగా కాళ్ళు వెనక్కి తీసుకున్నారు స్వామీజీ.

స్వామీజీకి ఏర్పాటుచేసిన ప్రత్యేకమైన గదిలోకి వెళ్ళిపోయారు. స్వామి వారికేం కావాలో ఏర్పాట్లు చెయ్యమని చెబుతున్నాడు గోపాలం. అత్తాకోడళ్ళు ఆ ఏర్పాట్లలో ఉన్నారు. గోపాలం, రాఘవరావు స్వామీజీని గురించి మాటల్లో పడ్డారు.

'రాఘవా... నువ్వు చాలా అదృష్టవంతుడివిరా... ఎందరెందరో... స్వామివారి ఆశ్రమానికి వస్తారు. మేం అదిస్తాం... యిదిస్తాం... అని యిబ్బంది పెడతారు తీసుకోమని. కాని స్వామివారు అంగీకరించరు. ఆయన మనసులో వీరికిది యివ్వాలి... వీరినుంచి ఇది తీసుకోవాలి అన్న అనుగ్రహం కలిగితే తప్ప. మీ అమ్మగారు చాలా బాధపడుతున్నారు నీ గురించి అందుకని స్వామివార్ని కదిపి చూసాను... నిజంగానే అదృష్టం సుమా యిలా చెప్పానో లేదో... అలా ఒప్పేసుకున్నారు. ఇక నీ అదృష్టం పండినట్టే... ఈ ఒప్పేసుకోవడం మాట అటుంచు. యింకో పవిత్రమైన కార్యక్రమానికి కూడా నిన్నే ఎన్నుకున్నారు... ఎంతమంది పోటీ పడ్డారనుకున్నావు ఆ పని చెయ్యడానికి... కాని అందర్నీ కాదని నీచేత అది చెయ్యిద్దాం అనేసరికి నిజంగా నాకు మతిపోయిందనుకో... అప్పుడే అనుకున్నాను. మా రాఘవ దశ తిరిగిందని గుక్కతిప్పుకోకుండా చెప్పుకుపోతున్నాడు గోపాలం.

'ఏమిట్రా... నీ ధోరణిలో నువ్వు మాట్లాడేస్తున్నావు. ఇంతకీ విషయం ఏమిటి? 'నన్ను ఎన్నుకోవడం ఏమిటి?'

'చెబుతాన్రా... ఏమీ లేదు. స్వామివారి ఆశ్రమంలో యీమధ్యనే శివలింగప్రతిష్ఠ జరిగింది. కాశీ నుంచి తెప్పించాడో భక్తుడు. నీ దగ్గరికి బయల్దేరేముందు గర్భగుడిలో పాల రాతిని అమర్చే అవకాశం మీవాడికి యిద్దామయ్యా... గరళ కంఠుడ్ని చల్లబరిస్తే ఆయన చల్లగా చూస్తాడు. అని చెప్పార్రా... అసలా పనిచేసేందుకు ఎంతమంది ముందుకొచ్చారనుకున్నావ్... నాకే ఆశ్చర్యమేసింది. మేమిస్తాం.. మేం చేయిస్తాం అన్నవాళ్ళని వదిలేసి... ఏదో మీరు రమ్మంటున్నారని నేనీయన్ని బ్రతిమాలటం ఏమిటి, ఈయన సడెన్‌గా ఈ ప్రతిపాదన తేవడమేమిటి?

రాఘవా... నువ్వు చాలా అదృష్టవంతుడివిరా... ఎందరెందరో... స్వామివారి ఆశ్రమానికి వస్తారు. మేం అదిస్తాం... యిదిస్తాం... అని యిబ్బంది పెడతారు తీసుకోమని. కాని స్వామివారు అంగీకరించరు. ఆయన మనసులో వీరికిది యివ్వాలి... వీరినుంచి ఇది తీసుకోవాలి అన్న అనుగ్రహం కలిగితే తప్ప. మీ అమ్మగారు చాలా బాధపడుతున్నారు నీ గురించి అందుకని స్వామివార్ని కదిపి చూసాను... నిజంగానే అదృష్టం సుమా యిలా చెప్పానో లేదో... అలా ఒప్పేసుకున్నారు. ఇక నీ అదృష్టం పండినట్టే...

